భద్రతకు భరోసా ఇవ్వాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా వైద్యాధికారులు, నర్సులు, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం భద్రత కల్పించాలి. అలా చేసినప్పుడు స్వేచ్ఛగా మహిళలు ఉద్యోగాలు చేయ గలుగుతారు. కోల్‌కతాలో మహిళ డాక్టర్ పై జరిగిన ఘటన చాలా దారుణం. ఇలాంటి ఘటనలు జరిగిన వెంటనే ప్రభుత్వాలు త్వరగా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ వరలక్ష్మి, వైద్యాధికారి, పీహెచ్‌సీ గిరిజాకాలనీ



చట్టం పక్కాగా అమలు చేయాలి



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తే వైద్య రంగంలో మహిళా ఉద్యోగులకు మరింత భద్రత కలుగుతుంది. ఈ చట్టం అమలుతో డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బంది పై దాడులు జరిగితే ఫిర్యాదు అందిన అరగంట వ్యవధిలోనే నిందితుల పై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టంపై విస్తృత ప్రచారం కల్పించాలి. తద్వార వైద్య రంగంలో మహిళలకు రక్షణ కలుగుతుంది.కోల్‌కత్తాలో మహిళా జూనియర్ డాక్టర్ పై జరిగిన హత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. వైద్యులు, సిబ్బందిలో మనో ధైర్యం నింపాలి

– విజయలక్ష్మి, స్టాఫ్ నర్స్, పీహెచ్‌సీ దేవాడ

క్లుప్తంగా

గణపతి ఉత్సవాలకు శ్రీకారం



పందిరి రాట వేస్తున్న సంఘం సభ్యులు

పెదగంట్యాడ: గణపతి ఉత్సవాలను నెల్లిముక్కు ధర్మాల వీధిలో ఘనంగా నిర్వహించనున్నట్టు పెంటమాంబ యువజన సేవా సంఘం ప్రతినిధులు ఎల్లయ్య రెడ్డి, పిట్ట రమణ, భాను శంకర్ రెడ్డి, ధర్మాల రామిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పందిరి రాటను బుధవారం వేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ వేడుకల్లో గ్రామస్తులు అనిల్‌కుమార్, సుమన్‌రెడ్డి, పిట్ట శ్రీను, నీలాపు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అగనంపూడి: పందిరి రాటలతో వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. 79వ వార్డు లంకెలపాలెం గ్రామంలో గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉత్సవాలకు వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు రాట వేసి అంకురార్పణ చేశారు. వార్డు నాయకులు సుందరపు శ్రీనివాసరావు, జాగృతీ రెడ్డి, కర్రి బుజ్జి, నారపిన్ని కిషోర్ పాల్గొన్నారు. అలాగే శనివాడ, జాబిల్లీ హిల్స్ కాలనీల్లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు గొల్లవిల్లి కనక భవాని, జాబిలీహిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సందడిగా విద్యార్థుల పట్టాభిషేకం



పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఉక్కునగరం: స్థానిక అరబిందో ఐడియల్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థుల పట్టాభిషేకం సందడిగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి. రామారావు విద్యార్థుల ప్రతినిధులుగా హెడ్‌బాయ్, హెడ్ గర్ల్‌లకు బ్యాడ్జీలు ధరింప చేసి అధికారికంగా ప్రకటించారు. తదుపరి హౌస్‌ల వారీగా కెప్టెన్, వైస్ కెప్టెన్లకు కూడా బ్యాడ్జీలు దరింప చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామారావు మాట్లాడుతూ తరగతి లీడర్, కెప్టెన్, వైస్ కెప్టెన్‌లు ఎలా ఉండాలి, నాయకత్వ లక్షణాలు ఎలా పెంపొందించు కోవాలో వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ షాజీమోన్ జోసెఫ్, కో–ఆర్డినేటర్ టి. ఎల్లేశ్వరరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

భారీ అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గాజువాక మెయిన్ రోడ్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన భారీ అన్న సమారాధనను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఐదు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, ఆలయ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, ప్రతినిధులు గొలగాని అప్పారావు, పల్లా నూకరాజు, పల్లా ఎల్లాజీరావు, ఉరుకూటి పైడిరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: ఆటోనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఆటోనగర్ ఫీడర్‌లో శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా విశ్వేశ్వరయ్యనగర్‌కు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గజముఖం.. విభిన్న రూపం



పరమేశ్వరుని రూపంతో..

- చవితికి సిద్ధమవుతున్న గణనాథుని ప్రతిమలు
- రేయింబవళ్లు తయారు చేస్తున్న కళాకారులు
- రూ.2 వేల నుంచి రూ.లక్ష ఖరీదైన విగ్రహాలు సిద్ధం



వినాయక చవితికి సిద్ధమవుతున్న విగ్రహాలు

పెదగంట్యాడ: వినాయక చవితి సమీపిస్తోంది.. ఆది దేవునికి తొలి పూజ చేసేందుకు భక్తులు కూడా సిద్ధమవుతున్నారు.. ప్రతి ఇంటితో పాటు వీధివీధినా గణనాథుని ఉత్సవాలు చేసేందుకు ఆయా కమిటీలు ప్రణాళికలు రచిస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఘనంగా ఉత్సవాలు చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. నిర్వాహకుల అభిరుచులకు అనుగుణంగా మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, సమతానగర్, దయాల్‌నగర్ ప్రాంతాల్లో వినాయకుడి ప్రతిమలను తయారు చేయడంలో కళాకారులు తలమునకలై ఉన్నారు. రాత్రీ పగలూ తేడా లేకుండా పని చేస్తున్నారు.

కోల్‌కతా నుంచి బంక మట్టి

వినాయకుని ప్రతిమలను విభిన్న రూపాల్లో తయారు చేస్తున్న కళాకారులు దానికి అవసరమైన సరంజామాను సిద్ధం చేసుకున్నారు. ముందుగా కర్రలు, గడ్డితో ఒక ఆకారాన్ని రూపుదిద్దుతున్నారు. అనంతరం మట్టిని మెత్తి ఆ ఆకారానికి రూపం తీసుకువస్తున్నారు. దీనికి అవసరమైన బంక మట్టిని కోల్‌కతా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. బొమ్మలను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దిన అనంతరం వాటికి రంగులు వేస్తున్నారు..

రూ.2 వేల నుంచి రూ.లక్ష వరకూ..

ఇక్కడ తయారు చేస్తున్న బొమ్మల్లో రూ.2 వేల నుంచి రూ.లక్ష వరకూ ఉన్నాయి. చిన్న బొమ్మలను రెండు వేలకు, పెద్ద బొమ్మలకు రూ.30 వేల నుంచి లక్ష రూపాయలు వరకూ తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సవ కమిటీల ప్రతినిధులు వారికి కావాల్సిన బొమ్మలకు అడ్వాన్సులు ఇస్తున్నారు. ఆయా బొమ్మలపై నెంబర్లు వేయించుకుంటున్నారు.

ఆర్డర్ ప్రకారం తయారీ

కొంతమంది తమకు కావాల్సిన ఆకృతుల ప్రకారం బొమ్మలు తయారు చేయాలని ఆర్డర్లు ఇస్తున్నారు. రూపం ఎలా ఉండాలి.. ఏయే రంగులు వేయాలో వారే నిర్ణయిస్తున్నారు. దాని ప్రకారం వాటిని తయారు చేస్తున్నారు.

విభిన్న రూపాలు..


గజ ముఖునికి విభిన్న రూపాల్లో ప్రతిమలు తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నారు.. సింహాసనం మీద కూర్చున్నట్టు.. పరమేశ్వరుడు తపస్సు చేస్తున్నట్టు, అరటి చెట్ల మధ్యలో ఉన్నట్టు.. కృష్ణా అవతారంలో.. వేంకటేశ్వరస్వామి రూపంలో.. త్రిముఖం .. పంచముఖాలతో,డ్రాగన్‌తో, అరటి చెట్లు మధ్యలో ఉన్న రూపాలతో రూపుదిద్దుకొంటున్న ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. మండలంలో 150 కి పైగా మండపాలు ఏర్పాటు చేయనున్నారు.

కోల్‌కతా నుంచి వచ్చి

26 ఏళ్ల కిందట కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారుల కుటుంబాల ఇక్కడి స్థిరపడిపోయాయి. ఇక్కడే గుడారాలు వేసుకుని అక్కడే వినాయకుని ప్రతిమలు తయారు చేస్తున్నారు. ఏటా వినాయక చవితితో పాటు దసరాకు దుర్గాదేవి, విశ్వకర్మ, కృష్ణాష్టమి పూజల కోసం ఇక్కడ బొమ్మలు తయారు చేస్తున్నారు.



కృష్ణ జింకతో..



అరటి చెట్ల మధ్యలో గణనాథుడు



పరమేశ్వరుని రూపంతో..

గిరాకీ బాగుంది



మట్టి గణపతుల ప్రతిమలకు ఆదరణ ఎక్కువగా ఉంది. వినాయక చవితికి రెండు నెలల ముందు నుంచే ఆర్డర్లు వస్తున్నాయి. మా దగ్గర రూ. 2 వేల నుంచి రూ.ఒక లక్ష వరకూ విలువైన బొమ్మలు ఉన్నాయి. ఆర్డర్ల ప్రకారం.. కమిటీల సూచించిన మేరకు ప్రత్యేకంగా గణపతిని తీర్చిదిద్ది అందిస్తున్నాం. ఈ ఏడాది గిరాకీ బాగుంది.

– సంజయ్ పాల్, కళాకారుడు,కోల్‌కతా

బొమ్మలకు భలే డిమాండ్



ప్రతి ఏడాది వినాయకుని మట్టి బొమ్మలకు డిమాండ్ పెరుగుతోంది. మండలంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన కమిటీ ప్రతినిధులు ముందుగా ఆర్డర్లు ఇచ్చి వారికి కావాల్సిన రూపాలను తయారు చేయించుకుంటున్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతోంది. కోల్‌కతా నుంచి వచ్చి ఇక్కడ బొమ్మలు తయారు చేస్తున్నాం.

– ఉజ్వల్, కళాకారుడు కోల్‌కతా.

ఉత్తర ప్రత్యుత్తరాలతోనే తెలుగుకు గుర్తింపు



తెలుగు భాషకు ప్రాధాన్యం పెంచాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: తెలుగు భాష గొప్పదనం, ఔన్నత్యం పెరగాలంటే జాతీయ స్థాయిలో తెలుగు భాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాషకు కనీస ప్రాధాన్యమివ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు భాషలో స.హ.చ లేఖలు రాస్తే తిప్పి పంపుతున్నారని, తెలుగు భాషకు కూడా కేంద్ర ప్రభుత్వ శాఖలతోపాటు ప్రధాని, రాష్ట్రపతి కార్యాలయాల్లో ప్రాధాన్యం పెంచేలా చూడాలన్నారు. అప్పుడే తెలుగు భాషకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని భావించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రచయిత కట్టా పైడిరాజు, వాకింగ్ క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, రైల్వే సలహా మండలి డైరెక్టర్ కొలిపాక అప్పారావు, ఉక్కు కార్మిక సంఘం నాయకుడు శీరంశెట్టి గోవిందరావు పాల్గొన్నారు.

విద్యార్థుల నడవడికను గమనించాలి



స్టీల్‌ప్లాంట్ జీఎం రామ్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న సీఐ, కళాశాల ప్రిన్సిపాల్

అగనంపూడి: విద్యార్థుల నడవడికతో పాటు ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తుండాలని దువ్వాడ ఇన్‌స్పెక్టర్ వావిలపల్లి ఎర్రంనాయుడు అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశ కీలకమైందని, ఈ దశలో వేసే ప్రతీ అడుగు జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తుందన్నారు.మైనర్లు వాహనాలు నడపకూడదని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయికి బానిసలుగా మారిన యువత దారి తప్పి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని చెప్పారు. మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఈనెల 31న పదవీ విరమణ పొందనున్న స్టీల్ ప్లాంట్ జీఎం రామప్రసాద్‌ను సీఐ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ, ఆశాలత, జి.వరప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభా పురస్కారానికి కణితి హైస్కూల్ ఎంపిక

180 పాయింట్లతో అగ్రస్థానం



విద్యార్థులు సాధించిన జ్ఞాపికలతో పాఠశాల హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు

అగనంపూడి: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విశాఖ జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు కణితి హైస్కూల్ ఎంపికైంది. 180 పాయింట్లతో జిల్లాలో అగ్రగామిగా నిలిచింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వివరాలను వెల్లడించింది. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను క్రీడా దినోత్సవం సందర్భంగా సత్కరించనున్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కణితి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం విశాఖలో నిర్వహించనున్న కార్యక్రమంలో స్పోర్ట్స్ ఎక్సలెన్సీ (క్రీడా ప్రతిభా అవార్డు)ను అందుకోనున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు మన్నాజీ, కె.నారాయణరావు తెలిపారు.

దోమలు వృద్ధి చెందకుండా చైతన్య కార్యక్రమాలు

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



డ్రోన్ల సహాయంతో దోమల మందు పిచికారీపై సూచనలిస్తున్న కమిషనర్ సంపత్ కుమార్

అగనంపూడి: వ్యర్థాలతో అనర్థాలకు అవకాశం ఉందని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు డంపింగ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. 79వ వార్డులోని గ్లవానిపాలెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు పరిధిలో అధికంగా వ్యర్థాలు కనపడుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్తను విభజించి క్లాప్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డులకు వెంటనే తరలించాలని ఆదేశించారు. దోమల నివారణకు ఎంఎల్ తైలాన్ని పిచికారీ చేయాలని సూచించారు. నీటి నిల్వలు ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతాయని, వాటి వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



నడుపూరు పైడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద కురుస్తున్న వర్షం (ఇన్‌సెట్) గాలులకు విరిగిపడ్డ చెట్టు

పెదగంట్యాడ: వర్షం దంచి కొట్టింది.. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఏకధాటిగా కురిసిన వానకు జీనజీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి. రహదారులన్నీ చెరువులను తలపించాయి. ఒక్కసారిగా కురిసిన వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో స్థానికులు బయట అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లోని నివాసితుల ఇళ్లలోకి నీరు రావడంతో అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు.

రోడ్లు జలమయం

గాజువాక: గాజువాకలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో సుమారు గంటపాటు కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వివిధ చోట్ల చెట్లు నేలకొరిగాయి. ఈదురు గాలులు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. వర్షం తగ్గిన కొద్దిసేపటికి ఈపీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పంప్ హౌస్ స్థలం కబ్జా!

- 300 గజాల ఆక్రమణ, ఫెన్సింగ్ ఏర్పాటు
- ఫిర్యాదులు వెళ్లినా నిద్ర నటిస్తున్న అధికారులు



పంప్ హౌస్ స్థలంలో వేసిన ఫెన్సింగ్



పంప్ హౌస్‌కు వేసిన గేటు తొలగించిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: నగరంలో ఖరీదైన ప్రాంతాల్లో షీలానగర్ ఒకటి. అలాంటి ప్రాంతంలో కబ్జాదారుల కన్ను ఓ పంప్ స్థలంపై పడింది. సుమారు 300 గజాలు కబ్జా చేయడంతో పాటు దర్జాగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసేశారు. పంప్ హౌస్‌కు ఏర్పాటు చేసిన గేటు తొలగించి ఆక్రమణ దారుడు గేటు ఏర్పాటు చేయడంతో జీవీఎంసీ పంప్ హౌస్ సిబ్బంది విస్మయానికి గురయ్యారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

షీలానగర్ ప్రాంతంలో ఉన్న పంప్ హౌస్ క్వార్టర్స్ వద్ద సుమారు 700 గజాల పంప్ హౌస్ స్థలం ఉంది. ఇందులో 300 గజాలకు పైగా కబ్జాకు గురైందని గ్రహించిన మంచినీటి విభాగం ఏఈ జీవీఎంసీ కమిషనర్‌తో పాటు, గాజువాక జెడ్సీ, మంచినీటి సరఫరా విభాగం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వీరు వెంటనే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఇంత వరకూ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు , సిబ్బంది స్పందించక పోవడంతో అనుమానాలకు తావిస్తోంది.

బెదింపులే కారణమా?

స్థలం కబ్జాకు పాల్పడిన వ్యక్తి ఆ ప్రాంతాన్ని జీవీఎంసీ సిబ్బంది పరిశీలించడానికి వెళ్లిన వారిపై బెదిరింపులకు పాల్పడ్డాడని సమాచారం. ఈ స్థలం తనదంటా బుకాయించడానికి ప్రయత్నించాడని, సంబంధిత డాక్యుమెంట్లు చూపమంటే చల్లగా జారుకున్నాడని పంప్‌హౌస్ సిబ్బంది తెలిపారు. కబ్జా గురించి షీలానగర్ అప్‌కీప్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి ఐద్వా జిల్లా కమిటీ కార్యదర్శి వై.సత్యవతి జీవీఎంసీ కమీషనర్‌కు లేఖ అందజేశారు. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి స్పందనలేదు. కాగా కబ్జాకు పాల్పడిన వ్యక్తికి జీవీఎంసీ ప్రధాన సిటీ ప్లానర్ అండదండలు పుష్కలంగా ఉండడంతో దీనిపై ఎవరూ నోరు మెదపలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని స్థలాన్ని పరిరక్షించాలని షీలానగర్ వాసులు కోరుతున్నారు.

అనాథ శరణాలయం నిర్మాణానికి పూజలు

గాజువాక: వాసవీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జగ్గు జంక్షన్ వద్ద వృద్ధాశ్రమం, అనాథ శరణాలయ నిర్మాణ స్థలంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గుండా శరత్ చంద్ర గుప్త, కోట పెద్ద వెంకటేశ్వరరావు, నంబూరి జగన్నాథరావు, కులుకూరి మంగరాజు, కేశారపు రమేష్, కేశారపు సతీష్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం ఉక్కును ఆదుకుంటుంది

అగనంపూడి: విశాఖ ఉక్కును ఆదుకోదానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీజేపీ గాజువాక కన్వీనర్ కె.నరసింగరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1294వ రోజు దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.1500 కోట్ల మేరకు నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. టీఎస్‌టీయూసీ నాయకులు విళ్లా రామ్మోహన్ కుమార్, జనసేన నాయకుడు గంధం వెంకటరావు , గూడూరు శంకరరావు, ఈగలపాటి యువశ్రీ, పంచదార్ల ఉగ్రం, బొత్స దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు సమష్టిగా కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి సమష్టిగా కృషి చేద్దామని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ పిలుపునిచ్చారు. బుధవారం ఉక్కు ప్రధాన సమావేశ మందిరంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక స్థితిని నిరంతరం మెరుగుపరచడానికి సంబంధించిన సమగ్ర ప్రణాళికలో భాగంగా ఉత్పత్తి పెంపు, వ్యయ నియంత్రణ చర్యలను అమలు చేయాల్సి ఉందని తెలిపారు. ఇందుకు అధికారులు, కార్మికులు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు డైరెక్టర్లు ఎ.కె.బాగ్చీ, ఎస్.సి. పాండే, గణేష్, జి.వి.ఎన్. ప్రసాద్‌తో పాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.